RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్


దినపత్రిక

వరంగల్
సంపుటి: 4 సంచిక:86 | శనివారం
మార్చి 14, 2026 | పేజీలు 8
వెల: రూ.3-00 | లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

## హోర్ముజ్ జలసంధి దాడుల్లో ముగ్గురు ఇండియన్స్ మృతి



2లో




- ఫోన్ ద్వారానే బందీ చేసే మాయాజాలం
- డిజిటల్ అరెస్ట్ అంటూ లక్షల్లో దోచేస్తున్నారు
- రకరకాలుగా మోసాలకు పాల్పడుతున్న వైనం
- చదువుకున్నవారు.. ఉన్నతోద్యోగులు సైతం ఉచ్చులో
- ఇటీవల రిటైర్డ్ జడ్జీకే టోకరా..
- రూ. 1.66 కోట్లు ఖాతా నుంచి మళ్లింపు
- సైబర్ మోసాల బారిన పడొద్దంటున్న పోలీసులు, నిపుణులు

# సైబర్ పంజా!

**టెక్నాలజీ ప్రపంచంలో రెచ్చిపోతున్న కేటుగాళ్లు**

**విచ్చలవిడిగా ఆన్ లైన్ ఫ్రాడ్ వ్యవహారాలు**

2లో

వేద న్యూస్, ఫోకస్ టీమ్

టెక్నాలజీ మారుతోంది.. దాంతో పాటే సైబర్ నేరగాళ్ల రూటు మారుతోంది. గతంలో కేవలం లింకులు, ఓటీపీలతో సరిపెట్టిన కేటుగాళ్లు.. ఇప్పుడు నేరుగా మీ మనసుతో ఆడుకుంటున్నారు. చట్టం.. అరెస్ట్.. సీబీఐ అంటూ బాధితుల వెన్నులో వణుకు పుట్టిస్తూ.. గంటల తరబడి వీడియో కాల్స్‌లో బందీలుగా మారుస్తూ డిజిటల్ అరెస్ట్ పేరిట కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. యువత, ఉన్నతోద్యోగులు.. రిటైర్డ్ ఉద్యోగుల నుంచి ఏకంగా రిటైర్డ్ జడ్జీల వరకు ఈ అదృశ్య నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకుపోతున్నారు. తైవాన్ నుంచి డ్రగ్స్ పార్శిల్ వచ్చిందనో.. మీ ఆధార్ కార్డుతో హ్యూమన్ ట్రాఫికింగ్ జరుగుతుందనో భయపెడుతూ.. నకిలీ ఐడీ కార్డులు, ఫేక్ అరెస్ట్ వారెంట్లతో స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతున్న కోట్లు కొల్లగొడుతున్నారు. విద్యావంతులను సైతం బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు రకరకాల ఫ్రాడ్స్ చేస్తూ చీకటి కోణంలో బతుకుతున్నారు. అసలు డిజిటల్ అరెస్ట్ అంటే ఏమిటి? సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలంటే మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? మోసపోయామని తెలిస్తే గోల్డెన్ అవర్లో మనం చేయాల్సిన పనులేంటి? ఈ మొత్తం వ్యవహారంపై 'వేద న్యూస్' అందిస్తున్న ప్రత్యేక కథనం..



## ఆస్తులు.. ఐశ్వర్యం నుంచి ఆకలి చావు వరకు..

- ఒకప్పుడు గ్రామాన్ని శాసించిన కుటుంబం
- చివరికి యాచకుడిగా జీవితం
- రోడ్డుపై భిక్షాటనతో ముగిసిన కల్వకోట విజేందర్‌రావు దీనగాథ

2లో

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు.. రూ.18 లక్షల మోసం

- ఫోన్‌పే, పేటీఎం ద్వారా డబ్బుల బదిలీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్

2లో



# ఆ కూడలి.. ప్రమాదాల లోగిలి



- కడిపికొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నిత్యం యాక్సిడెంట్స్
- ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు నిల్
- భయాందోళనలో స్థానికులు

2లో

వేద న్యూస్, కాజీపేట

రహదారులపై మలుపులు, కూడళ్లు సాధారణమే అయినప్పటికీ కొన్ని ప్రాంతాలు ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాంటిదే కాజీపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లే కడిపికొండ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న ప్రధాన సిగ్నల్ కూడలి. ఈ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. ఎక్కడి నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందో తెలియని పరిస్థితి ఉండటంతో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సి వస్తోంది. గతంలో ఈ కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడగా, కొన్ని కుటుంబాలు తీవ్ర నష్టాలను చవిచూశాయి. సిగ్నల్ వద్ద ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ ట్రాఫిక్ నియంత్రణపై సరైన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కడిపికొండ ఫ్లైఓవర్ నుంచి వచ్చిన లారీ, కారు సిగ్నల్ మలుపు వద్ద ఢీకొన్న ఘటన కూడా చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. గతంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్ కూడా ఇక్కడ ప్రమాదానికి గురైన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు తరచూ జరుగుతున్నప్పటికీ అధికారులు తగిన రక్షణ చర్యలు తీసుకోకపోవడం గమనార్హమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ కూడలి వద్ద భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆర్టీసీ సమ్మె నోటీసులు




2లో

- ప్రభుత్వానికి ఉద్యోగుల హెచ్చరిక
- 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ డిమాండ్
- బకాయిల విడుదలపై ఆర్టీసీ జేఏసీ ఆందోళన

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మోదీ ఆందోళన



- ఇరాన్ అధ్యక్షుడితో ఫోన్‌లో చర్చ
- భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత
- ఎల్పీజీ కొరతపై వదంతులను ఖండించిన ప్రధాని

2లో

వేద న్యూస్

శనివారం | మార్చి 14, 2026

## టీఆర్పీ పార్టీ జెండా ఆవిష్కరణ



**వేద న్యూస్, హనుమకొండ**

గోపాలపురం పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ)పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, టీఆర్పీ పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీఆర్పీ రాష్ట్ర నాయకులు తానం రామన్ కుమార్, మదం నరేష్ యాదవ్, రోహిత్ బత్తుల, మేరుగు భారద్వాజ్ నేత తదితర నాయకులు భారీ గజమాలతో తీన్మార్ మల్లన్నను ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో ప్రజల హక్కుల కోసం టీఆర్పీ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మోదీ ఆందోళన

- ఇరాన్ అధ్యక్షుడితో ఫోన్‌లో చర్చ
- భారతీయుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత

**వేద న్యూస్, డెస్క్**

పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ, ప్రాంతీయ భద్రత మరియు శాంతి స్థాపనపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని సామాజిక మాధ్యమం ద్వారా వెల్లడించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల ప్రాణనష్టం, మౌలిక సదుపాయాల విధ్వంసం వంటి అంశాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో నివసిస్తున్న భారతీయుల భద్రత, క్షేమమే భారత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని ప్రధాని స్పష్టం చేశారు. సరకు రవాణా, ఇంధన సరఫరా వంటి అంశాలు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల ద్వారా రవాణా నిరంతరాయంగా సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. హింసకు ముగింపు పలికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రధాని సూచించారు. పశ్చిమాసియా దేశాల్లో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వీరిలో ఇరాన్‌లో సుమారు తొమ్మిది వేల మంది, ఇజ్రాయెల్‌లో నలభై వేల మందికి పైగా భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయుల భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే కొంతమంది విద్యార్థులు భారత రాయబార కార్యాలయం సహాయంతో స్వదేశానికి చేరుకున్నారని విదేశాంగ శాఖ తెలిపింది. మిగతా వారిని కూడా సురక్షితంగా తరలించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా దిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాని మోదీ దేశంలో ఎల్పీజీ కొరత ఉందంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ పరిస్థితులను అడ్డంగా పెట్టుకుని కొన్ని వస్తువులను అక్రమంగా నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. అలాంటి అక్రమ చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశ ఇంధన భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రధాని తెలిపారు. 2014కి ముందు దేశంలో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు చాలా తక్కువగా ఉన్నాయని, ప్రస్తుతం దేశంలో ఐదు మిలియన్ టన్నులకు పైగా వ్యూహాత్మక చమురు నిల్వలు ఉన్నాయని ఆయన చెప్పారు. గత దశాబ్దంలో దేశ శుద్ధి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాన్ని కూడా దేశం సమర్థంగా ఎదుర్కొంటుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

## హోర్ముజ్ జలసంధి దాడుల్లో ముగ్గురు భారతీయుల మృతి


**వేద న్యూస్, డెస్క్**

హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో జరిగిన దాడుల్లో ఇప్పటివరకు ముగ్గురు భారతీయులు మరణించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరో భారతీయుడు గల్లంతైనట్లు తెలిపింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఈ మార్గంలో భారత నౌకలతో పాటు అనేక దేశాలకు చెందిన నౌకలు చిక్కుకుపోయినట్లు సమాచారం. కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కే సిన్హా వివరాల ప్రకారం హోర్ముజ్ జలసంధి మార్గంలో ఉన్న భారత నౌకల భద్రతపై ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోంది. శుక్రవారం ఒక భారత నౌక ఈ జలసంధి మార్గాన్ని సురక్షితంగా దాటినట్లు తెలిపారు. అయితే ఆ నౌక ప్రధాన మార్గం ద్వారా కాకుండా తూర్పు వైపు నుంచి ప్రయాణించి ఆఫ్రికా దిశగా వెళ్తోందని చెప్పారు. ప్రస్తుతం హోర్ముజ్ జలాల్లో మొత్తం 27 భారత నౌకలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో పశ్చిమ ప్రాంతం వైపు ఉన్న 24 నౌకల్లో 677 మంది సిబ్బంది ఉన్నారు. తూర్పు వైపు నాలుగు నౌకలు ఉండగా అందులో ఒకటి ఇప్పటికే జలసంధిని దాటింది. దీంతో తూర్పు ప్రాంతంలో ఇంకా మూడు నౌకలు చిక్కుకుపోయినట్లు వెల్లడించారు. ఆ నౌకల్లో సుమారు 76 మంది సిబ్బంది ఉన్నారు. గల్ఫ్ ప్రాంత సముద్ర మార్గాల్లో సాధారణంగా సుమారు 23 వేల మంది భారతీయులు వివిధ నౌకల్లో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో భారత నౌకల భద్రత కోసం ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పరిస్థితిపై పశ్చిమాసియాలోని వివిధ దేశాలతో దౌత్యపరమైన సంప్రదింపులు కొనసాగిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. భారతీయ సిబ్బంది భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

# సైబర్ పంజా!

- టెక్నాలజీ ప్రపంచంలో రెచ్చిపోతున్న కేటుగాళ్లు
- విచ్చలవిడిగా ఆన్ లైన్ ఫ్రాడ్ వ్యవహారాలు
- ఫోన్ ద్వారానే బంధీ చేసే మాయాజాలం
- డిజిటల్ అరెస్ట్ అంటూ లక్షల్లో దోచేస్తున్నారు
- రకరకాలుగా మోసాలకు పాల్పడుతున్న వైనం
- చదువుకున్నవారు.. ఉన్నతోద్యోగులు సైతం ఉచ్చులో
- ఇటీవల రిటైర్డ్ జడ్జికే టోకరా..
- రూ. 1.66 కోట్లు ఖాతా నుంచి మళ్లింపు
- సైబర్ మోసాల బారిన పడొద్దంటున్న పోలీసులు, నిపుణులు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**




సాంకేతికత ఎంతగా పెరుగుతుందో, అంతే వేగంగా నేరాలు కూడా రూపాంతరం చెందుతున్నాయి. గతంలో కేవలం ఓటీపీలు, లింక్‌ల ద్వారా డబ్బులు కాజేసిన నేరగాళ్లు, ఇప్పుడు నేరుగా వ్యక్తుల మానసిక స్థితిని దెబ్బతీస్తూ డిజిటల్ అరెస్ట్ అనే కొత్త తరహా మోసానికి తెరలేపారు. అమాయకులను ఫోన్ కాల్స్ ద్వారా భయభ్రాంతులకు గురిచేసి, వారిని గంటల తరబడి వీడియో కాల్స్‌లో బంధించి, లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న ఈ ముఠాల ఆగడాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి.

### ఏమిటీ డిజిటల్ అరెస్ట్?

డిజిటల్ అరెస్ట్ అనేది వాస్తవానికి చట్టబద్ధమైన అరెస్ట్ కాదు, అదొక పక్కా ప్లాన్ ప్రకారం జరిగే మోసం. నేరగాళ్లు పోలీసుల లాగానో, సీబీఐ లేదా నార్కోటిక్స్ అధికారుల లాగానో వేషధారణ చేసుకుని స్కైప్ లేదా వాట్సాప్ వీడియో కాల్ చేస్తారు. మీ పేరు మీద డ్రగ్స్ పార్శిల్ వచ్చింది లేదా మీ ఆధార్ కార్డ్ చట్టవిరుద్ధ కార్యకలాపాలకు వాడబడింది అని భయపెడతారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు మీరు వీడియో కాల్ నుంచి తప్పుకోకూడదని, ఎవరికీ ఫోన్ చేయకూడదని ఆజ్ఞాపిస్తారు. దీనినే 'డిజిటల్ అరెస్ట్' అని పిలుస్తూ, కేసు నుంచి బయటపడాలంటే డబ్బులు చెల్లించాలని బ్లాక్ మెయిల్ చేస్తారు.

### ఆన్ లైన్ ఫ్రాడ్ లోని ఇతర రకాలు

కేవలం డిజిటల్ అరెస్ట్‌లే కాకుండా, ఇతర మార్గాల్లోనూ సైబర్ దొంగలు విరుచుకుపడుతున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మిస్తారు. మొదట్లో చిన్న మొత్తంలో లాభాలు ఇచ్చి, భారీగా పెట్టుబడి పెట్టాక యాప్ క్లోజ్ చేసి పారిపోతారు. గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్ల కోసం వెతికినప్పుడు వచ్చే నకిలీ నంబర్లకు ఫోన్ చేస్తే, వారు సహాయం చేసే నెపంతో ఎనీ డెస్క్ వంటి యాప్స్ ఇన్‌స్టాల్ చేయించి మీ ఫోన్‌ను వారి ఆధీనంలోకి తీసుకుంటారు. సోషల్ మీడియాలో పరిచయం పెంచుకుని, విదేశాల నుంచి ఖరీదైన కానుకలు పంపామని, కస్టమ్స్ క్లియరెన్స్ కోసం డబ్బు కట్టాలని నమ్మించి మోసం చేస్తారు.

### అప్రమత్తతే ఏకైక రక్షణ

సైబర్ నేరాల నుండి రక్షణ పొందాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. గుర్తు తెలియని నంబర్ల నుండి వచ్చే వీడియో కాల్స్ ఎత్తకపోవడం ఉత్తమం. చట్టపరమైన ఏ అధికారి కూడా వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరని, గంటల తరబడి ఆన్‌లైన్‌లో ఉండమని చెప్పరని గుర్తించాలి. మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరికీ షేర్ చేయకూడదు. ఎవరైనా అధికారులు అని పరిచయం చేసుకుంటే, వెంటనే భయపడకుండా దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిర్ధారించుకోవాలి.

### ఇటీవల జరిగిన ప్రధాన ఘటనలు

హైదరాబాద్‌లో రిటైర్డ్ ఉద్యోగికి రూ. 80 లక్షల టోకరా ఇచ్చారు. నేరగాళ్లు ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులమని ఫోన్ చేశారు. బాధితుడి ఆధార్ కార్డు ఉపయోగించి తైవాన్ నుండి డ్రగ్స్ పార్శిల్ వచ్చిందని భయపెట్టారు. దాదాపు 48 గంటల పాటు అతడిని వీడియో కాల్‌లో 'డిజిటల్ అరెస్ట్' చేసి ఉంచారు. బయట ఎవరికైనా చెబితే దేశద్రోహం కేసు పెడతామని బెదిరించి, వివిధ విడతల్లో రూ. 80 లక్షలు కాజేశారు.

సికింద్రాబాద్ మహిళా డాక్టర్‌పై సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులమని నమ్మించి, ఆమె బ్యాంక్ ఖాతా మనీలాండరింగ్‌కు వాడబడిందని నమ్మించారు. ఆమెను రోజంతా వీడియో కాల్‌లో బంధించి, విచారణ పేరుతో భయపెట్టి సుమారు రూ. 50 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు.

మాదాపూర్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న యువ ఇంజనీర్ సైబర్ ఉచ్చులో చిక్కుకున్నారు. కొరియర్ స్కామ్ పేరుతో ఫోన్ చేసి, మీ పార్శిల్‌లో అక్రమంగా పాస్‌పోర్టులు దొరికాయని భయపెట్టారు. సీబీఐ అధికారి వేషంలో ఒకరు వీడియో కాల్‌లోకి వచ్చి, అరెస్ట్ వారెంట్ చూపిస్తూ అతడిని భయభ్రాంతులకు గురిచేశారు. భయం తో సదరు యువకుడు తన సేవింగ్స్ లోని రూ. 15 లక్షలు వారి ఖాతాల్లోకి పంపాడు.

సైబర్ కేటుగాళ్లు ఏకంగా హైదరాబాద్ కు చెందిన రిటైర్డ్ జడ్జికే టోకరా ఇచ్చారు. ఫిబ్రవరి 23న బాధితుడికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తనను తాను సీబీఐ అధికారి దీపక్ కుమార్‌గా పరిచయం చేసుకున్నాడు. బాధితుడి ఆధార్ కార్డుతో లింక్ అయిన ఫోన్ నంబర్ల ద్వారా మహిళల అక్రమ రవాణా, మనీలాండరింగ్ వంటి నేరాలు జరుగుతున్నాయని, బెంగళూరులో ఎఫ్ఐఆర్ నమోదైందని భయపెట్టారు. నేరగాళ్లు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా సుప్రీంకోర్టు లోగో ఉన్న నకిలీ అరెస్ట్ వారెంట్లను, పత్రాలను చూపించి బాధితుడిని నమ్మించారు. విచారణ పూర్తయ్యే వరకు ఎవరికీ ఫోన్ చేయకూడదని, వీడియో కాల్‌లోనే ఉండాలని (డిజిటల్ అరెస్ట్) ఒత్తిడి చేశారు. ఫైనాన్షియల్ అసెస్‌మెంట్ పేరుతో ఆయన బ్యాంక్ ఖాతాలోని డబ్బును తమ ఖాతాల్లోకి బదిలీ చేస్తే, విచారణ తర్వాత తిరిగి ఇస్తామని నమ్మించారు. దీనిని నిజమని నమ్మిన ఆయన ఫిబ్రవరి 25 నుండి మార్చి 2 మధ్య నాలుగు విడతల్లో మొత్తం రూ. 1.66 కోట్లను నేరగాళ్ల ఖాతాలకు పంపారు.

### మోసానికి గురైతే..

ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైతే, వెంటనే స్పందించడం చాలా ముఖ్యం. మోసం జరిగిన వెంటనే 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలి. మొదటి రెండు గంటలు (గోల్డెన్ అవర్స్) లో ఫిర్యాదు చేస్తే, మీ ఖాతా నుంచి వేరే ఖాతాలోకి వెళ్లిన డబ్బును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుంది. సైబర్ నేరగాళ్ల మాయలో పడి ప్రాణాలు తీసుకోవడం లేదా తీవ్రమైన ఆందోళనకు గురికావడం కంటే, ధైర్యంగా పోలీసులను ఆశ్రయించడం మేలు.

## ఆస్తులు.. ఐశ్వర్యం నుంచి ఆకలి చావు వరకు..

- ఒకప్పుడు గ్రామాన్ని శాసించిన కుటుంబం
- చివరికి యాచకుడిగా జీవితం
- రోడ్డుపై భిక్షాటనతో ముగిసిన కల్వకోట విజేందర్‌రావు దీనగాథ



**వేద న్యూస్, గంగాధర**

గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఒకప్పుడు గ్రామంలో ప్రభావం చూపిన దొర కుటుంబానికి చెందిన కల్వకోట విజేందర్‌రావు (78) ఆకలి, అనారోగ్యంతో అలమటిస్తూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఒకప్పుడు అపార ఆస్తులు, ఐశ్వర్యంతో వెలిగిన కుటుంబానికి చెందిన ఆయన చివరికి యాచకుడిలా జీవనం సాగించి ప్రాణాలు కోల్పోవడం గ్రామస్తులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.

### నైజాం కాలం నుంచి ప్రారంభమైన కుటుంబ చరిత్ర

నైజాం కాలంలో గర్శకుర్తి గ్రామానికి మాలి పటేల్, వతందార్‌గా కల్వకోట హన్మంతరావు వ్యవహరించారు. ఆ సమయంలో వారి కుటుంబానికి అపారమైన ఆస్తులు ఉండేవి. గ్రామంలో గౌరవం, ప్రభావంతో జీవించిన ఈ కుటుంబం కొంతకాలం వరకు ఐశ్వర్యంతో వెలిగింది. అయితే కాలక్రమేణా ఆస్తులు కరిగిపోవడంతో కుటుంబ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. హన్మంతరావు దాదాపు ఐదు దశాబ్దాల క్రితమే మరణించగా, ఆయన భార్య ప్రమీలాబాయి మరియు పెద్ద కుమారుడు నారాయణరావు కూడా రెండు దశాబ్దాల కిందటే మరణించారు. దీంతో ఆ కుటుంబానికి వారసుడిగా విజేందర్‌రావు ఒక్కడే మిగిలిపోయాడు. తల్లిదండ్రులు, సోదరుడు ఉన్న కాలంలోనే కుటుంబ ఆస్తులు క్రమంగా నశించిపోయాయి.

### ఉపాధి కోల్పోయి దుర్భర జీవితం

భూములు లేకుండా పోవడంతో విజేందర్‌రావు జీవితం కష్టాల్లో పడింది. జీవనోపాధి కోసం కొంతకాలం దేశాయి బీడీ కంపెనీలో ప్యాకింగ్ వర్కర్‌గా పనిచేశారు. కానీ ఆ కంపెనీ కార్యాలయం గ్రామం నుంచి తరలిపోవడంతో ఆ ఉపాధి కూడా కోల్పోయారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు మరింత పెరిగి రోజువారీ జీవితం కష్టసాధ్యంగా మారింది. ఇంతలో అనారోగ్యంతో ఆయన భార్య సుమిత్రాబాయి మరణించడంతో విజేందర్‌రావు పూర్తిగా ఒంటరిగా మిగిలిపోయారు. వయస్సు పెరగడం, ఆరోగ్యం క్షీణించడంతో పని చేయలేని స్థితికి చేరుకున్నారు. గ్రామంలో ఎవరైనా దయతలచి భోజనం ఇస్తే తినేవారు, లేకపోతే పస్తులే ఆయనకు శరణ్యంగా మారాయి.

### దొర కుటుంబం నుంచి యాచకుడిగా జీవితం

ఒకప్పుడు గ్రామ ప్రజలను శాసించిన కుటుంబంలో పుట్టి పెరిగిన విజేందర్‌రావు చివరకు రోడ్డుపైకి వచ్చి "రూ.5, రూ.10 ఇవ్వండి" అంటూ యాచకుడిలా అడుగుతూ జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. హుందాగా జీవించిన కుటుంబం చివరికి ఇలాంటి దుస్థితికి చేరుకోవడం స్థానికులను కలచివేసింది. చివరికి ఆకలి, అనారోగ్యంతో అలమటిస్తూ విజేందర్‌రావు శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఈ ఘటన గర్శకుర్తి గ్రామంలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. గ్రామస్తులు దీనిపై స్పందిస్తూ ఇలాంటి పరిస్థితులు మళ్లీ ఎవరికీ రాకుండా ప్రభుత్వాలు పేదలు, వృద్ధుల సంక్షేమంపై మరింత దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు.. రూ.18 లక్షల మోసం

- ఫోన్‌పే, పేటీఎం ద్వారా డబ్బుల బదిలీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్



**వేద న్యూస్, బోయినపల్లి**

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడి డిజిటల్ లావాదేవీల ద్వారా రూ.18 లక్షలకు పైగా మోసం చేసిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. గంగాధర మండలం ఒద్యారం గ్రామానికి చెందిన సత్పది సాయితరుణ్ (27) స్వగ్రామంలోని వెంకటేశ్వర దేవాలయంలో పూజారిగా పని చేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చెన్నమాధవుని రామరాజు (రిటైర్డ్ ఎంఈఓ) తో స్నేహం పెంచుకున్నాడు. ఒక రోజు రామరాజు మొబైల్‌లో ఫోన్‌పే, పేటీఎం యాప్‌లు సరిచేస్తానని చెప్పి పిన్ నంబర్లు మార్చాడు. అనంతరం తిరుపతి దర్శనానికి టికెట్లు బుక్ చేస్తానని చెప్పి అతని ఫోన్ తీసుకుని తెలియకుండా రూ.18,46,885 ను ఇల్లంతకుంట మండలం నరసక్కపేట గ్రామానికి చెందిన ధామేర హరీష్ ఖాతాకు బదిలీ చేశాడు. ఆ డబ్బును 'క్రిబేట్99' బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి బెట్టింగ్ ఆడినట్లు పోలీసులు తెలిపారు. మోసపోయానని గ్రహించిన రామరాజు బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాయితరుణ్, హరీష్ లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, రూ.80 వేల నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. డిజిటల్ లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ఆర్టీసీ సమ్మె నోటీసులు

- ప్రభుత్వానికి ఉద్యోగుల హెచ్చరిక
- 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ డిమాండ్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సహా పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఈ నోటీసులు సమర్పించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని ఉద్యోగులు హెచ్చరించారు. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యాలయ పేషీలోనే సమ్మె నోటీసులను జేఏసీ నేతలు సమర్పించారు. అదేవిధంగా లేబర్ కమిషనర్ కార్యాలయంలో కూడా నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ నాయకులు వెల్లడించారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ డిమాండ్ చేసింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్ల నిధులను కోత లేకుండా ఇవ్వాలని కోరింది. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.25వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని జేఏసీ నేతలు కోరారు. గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని, ఉద్యోగులపై ఉన్న అధిక పనిభారాన్ని తగ్గించాలని కూడా డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళ్లక తప్పదని ఆర్టీసీ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

వేద న్యూస్

శనివారం మార్చి 14, 2026

# మెట్‌పల్లిలో జ్యువెలరీ షాపులో చోరీ

**– షటర్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు**




**వేద న్యూస్, మెట్‌పల్లి:**

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని లైబ్రరీ రోడ్డులో ఉన్న జ్యువెలరీ దుకాణంలో శుక్రవారం వేకువజామున చోరీ జరిగింది. రవి కుమార్‌కు చెందిన జ్యువెలరీ షాపు షట్టర్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు దుకాణంలో ఉన్న సుమారు 30 గ్రాముల బంగారాన్ని అపహరించుకుని పరార య్యారు. అయితే లాకర్‌ను తెరవలేక పోవడంతో కొంత మేర బంగారం మాత్రమే చోరీ అయినట్లు సమాచారం. లాకర్ తెరిచి ఉంటే భారీ నష్టం జరిగేదని షాపు యజమాని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తెలంగాణ ఉమెన్స్ వాలీబాల్ జట్టు కోచ్‌గా ప్రభాకర్






**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన విలాసాగర్ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పంతం ప్రభాకర్ తెలంగాణ ఉమెన్స్ వాలీబాల్ జట్టు కోచ్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు వేములవాడలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మార్చి 2 నుంచి 12 వరకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించగా, అందులో పంతం ప్రభాకర్ శిక్షణ అందించారు. ఈ నెల 14 నుంచి 20 వరకు భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ ఉమెన్స్ జట్టుతో ఆయన మార్చి 13న బయలుదేరారు. తమ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ మరియు ఉపాధ్యాయ బృందం ఆనందం వ్యక్తం చేశారు.

# భీమేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.16 కోట్ల



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమే శ్వర స్వామి ఆలయం హుండీ ఆదాయాన్ని గురువారం అధికారులు వెల్లడించారు. గత 33 రోజుల కాలానికి గాను భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపంలో రూ. 2,16,65,140 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నగదుతో పాటు 161 గ్రాముల మిశ్రమ బంగారం, 10 కిలోల 900 గ్రాముల మిశ్రమ వెండి కూడా భక్తులు సమర్పించినట్లు వెల్లడించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ ఈవో రమాదేవి, కరీంనగర్ ఏసీ కార్యాలయ అధికారి రాజమౌళి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యనిర్వహణాధికారులు, ఆలయ సిబ్బంది, పోలీసులు మరియు రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సభ

**– గర్భిణులకు సీమంతాలు.. చిన్నారులకు అన్నప్రాసన**



**వేద న్యూస్, గంగాధర:**

గంగాధర మండలం గట్టు బుత్కూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం శుక్రవారం సభ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్లు సరోజన, అనంత లక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లీబిడ్డల ఆరోగ్యం, పోషకాహారం ప్రాముఖ్యతపై గ్రామ మహిళలకు అవగాహన కల్పించారు. గర్భిణులు గర్భధారణ సమయంలో సరైన పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు సంప్రదాయబద్ధంగా సీమంతాలు నిర్వహించి ఆశీర్వదించారు. అలాగే చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మల్కాపురం రాజేశ్వరి–రాజేశం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పవన్ కుమార్, అంగన్వాడీ సిబ్బంది రజిత, గ్రామ మహిళలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# స్పెల్లింగ్ బీ పోటీలకు 'సరస్వతి' విద్యార్థిని



**వేద న్యూస్, రామడుగు:**

రామడుగు మండలం వెలిచాల గ్రామానికి చెందిన సరస్వతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థిని ఉప్పు అన్విత జాతీయస్థాయి స్పెల్లింగ్ బీ పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో నిర్వహించిన జోనల్ స్థాయి స్పెల్లింగ్ బీ పోటీల్లో అన్విత తృతీయ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత పొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి ఎదగగలరని ఆయన అన్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అన్వితను విశ్వం ఎడ్యుటెక్ జోనల్ హెడ్ వినాయక్, ఇంటర్నేషనల్ మెమరీ ట్రైనర్ దైవాల వేణుకుమార్, స్కూల్ కో–కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

# చీపురు పట్టి..డ్రైనేజ్ కాల్వ సాఫ్ చేసి..

**– ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా..**

**– మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పారిశుధ్య పనులు**



**వేద న్యూస్, జమ్మికుంట:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 4వ వార్డులో స్థానిక కౌన్సిలర్ పోల్నేనీ అజయ్ రావు తో కలిసి వార్డును మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) సందర్శించారు.వార్డులో ప్రధాన సమస్యగా మెర్జ్ విలేజ్ అయిన కొత్తపల్లిలో అమృత్ స్కీం ద్వారా ఏర్పాటు చేస్తున్న నల్ల కలెక్షన్స్ కొన్ని గృహాలకు రావడం లేదనీ తెలిపారు. చొరవ తీసుకొని ప్రతి ఇంటికి నల్ల కలెక్షన్ ఏర్పడేలాగా చూడవాలని స్థానిక వార్డు ప్రజలు చైర్మన్ కు తెలపగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఏఈ కి తెలిపి వార్డులోని ప్రతి గృహానికి నల్ల కలెక్షన్ ఉండేలా చూడమని తెలిపారు.సందర్భంలో వార్డులోని పలువురు చైర్మన్ శ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) గని మర్యాదపూర్వకంగా వారి గృహాలకు ఆహ్వానించారు. ఘనంగా సన్మానించారు. వార్డులో డ్రైనేజ్ తీస్తున్న కార్మికుల దగ్గరకు వెళ్లి..“ మా నానమ్మ తాత నుండి మది మున్సిపల్ కుటుంబం అని.. డ్రైన్ తీసి మరి..“ నిరూపించాడు. వార్డులో కొందరు డ్రైనేజీ సమస్య ఉందనీ, సిసి రోడ్డు కూడా కావాలని చైర్మన్ కి తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్ స్పెక్టర్ మహేష్ ,ఏఈ వికాస్, శ్రీకాంత్ వార్డ్ ఆఫీసర్స్ మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా డాక్టర్ లేక గర్భిణుల అవస్థలు

- సిరిసిల్లకు వెళ్లాలంటూ పంపిస్తున్న వైనం
- ఆస్పత్రికి వచ్చేవారిపైనా సిబ్బంది దురుసు ప్రవర్తన
- ఇదీ వేములవాడ ప్రభుత్వాస్పత్రి తీరు



**వేద న్యూస్, వేములవాడ:**

వేములవాడ ఏరియా ఆసుపత్రిలో మహిళా వైద్యురాలు లేకపోవడంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రుద్రంగి మండలానికి చెందిన గౌతమి అనే గర్భిణికి గురువారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే డాక్టర్ అందుబాటులో లేరని చెప్పి సిరిసిల్లకు వెళ్లాలని వైద్య సిబ్బంది సూచించడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని వారు తెలిపారు. ఇక గర్భిణి పట్ల ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గర్భిణిని తీసుకొచ్చిన 108 అంబులెన్స్ సిబ్బందితో నర్సు దురుసుగా ప్రవర్తించిందని సమాచారం. ఈ ఘటనపై స్థానికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదే విధంగా గతంలో కూడా తొమ్మిది నెలల గర్భిణితో డ్యూటీలో ఉన్న డాక్టర్ దురుసుగా ప్రవర్తించడంతో ఆమె ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం చేయించుకున్నట్లు తెలుస్తోంది. పేద ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# విద్యార్థులూ.. ఆల్ ద బెస్ట్

- పది ఫలితాలతో మెరవాలి.. తల్లిదండ్రులు మురవాలి
- నిర్ణీత సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు వెళ్లాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**వేద న్యూస్, బోయినిపల్లి:**

పదవ తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చుతూ ఉజ్వల భవిష్యత్తును సాధించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆకాంక్షించారు. నేటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలను విద్యార్థులు విజయవంతంగా రాయాలని సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పరీక్షలు రాయనున్న 5,17,727 మంది విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయానికి కనీసం అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ముఖ్యంగా తన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ముందస్తుగా అభినందనలు తెలిపారు. విద్యార్థుల చదువుపై ఉన్న ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని పదవ తరగతి చదివే పేద విద్యార్థులకు సుమారు 20 వేల సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు. దీంతో విద్యార్థులు పాఠశాలకు సకాలంలో వెళ్లే అవకాశం కలిగిందన్నారు. అదేవిధంగా పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజును కూడా తాను చెల్లించడంతో తల్లిదండ్రులపై కొంత ఆర్థిక భారం తగ్గిందన్నారు. పరీక్షల సమయంలో అనవసరమైన ఆందోళనలకు గురికాకుండా ఇప్పటివరకు చదివిన పాఠ్యాంశాలను పునశ్చరణ చేసి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. గత ఏడాది ఫలితాల్లో కరీంనగర్ జిల్లా ఉత్తీర్ణతలో ఆరో స్థానంలో, సిరిసిల్ల జిల్లా ఐదవ స్థానంలో నిలిచాయని గుర్తుచేస్తూ ఈసారి ఈ రెండు జిల్లాలు మొదటి రెండో స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. అలాగే అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, పోలీసులు విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రవాణా, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ఈ నెల 14న తాను చేపట్టనున్న కొండగట్టు అంజన్న పాదయాత్ర సందర్భంగా కూడా విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తెలంగాణ డిజిటల్ కేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేణుగోపాల్



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

తెలంగాణ డిజిటల్ మీడియా కేబుల్ న్యూస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ప్రకటించడం జరిగింది. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఏ1 టీవీ మీడియా ఛానల్ కమటం వేణుగోపాల్ ని రాష్ట్ర కమిటీ అధికారకంగా నియమించారు. శుక్రవారం నుంచి రెండు సంవత్సరాల కాలం పాటు వేణుగోపాల్ పదవిలో కొనసాగుతారని తెలంగాణ డిజిటల్ కేబుల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాచర్ల గోపి ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాచర్ల గోపి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కమటం వేణుగోపాల్ కి శుభాకాంక్షలు తెలుపుతూ కేబుల్ ఛానల్ వ్యవస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్క జర్నలిస్టుకి అందవలసిన పథకాలు అందించే విధంగా కృషి చేయాలని కోరారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



**వేద న్యూస్, కోటగిరి :**

కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద పాఠశాలలో లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ఆధ్వర్యంలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ కోశాధికారి ఉమాకాంత్ దేశ్ముఖ్ వీటిని విద్యార్థులకు అందించారు. పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను భయాన్ని వీడి రాయాలని, మండల స్థాయిలో ప్రతిభను కనపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కోటగిరి డైమండ్ అధ్యక్షుడు తెల్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు పటేల్, పాఠశాల కరస్పాండెంట్ తెల్ల అక్షర, ఉపాధ్యాయ బృందం సాయి పవన్, నఫీస్, సురేఖ, నాగరాజు, భీమ్రావు, గంగాధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్
శనివారం మార్చి 14, 2026

# మంత్రి వాకిట శ్రీహరి హామీ గాలికి..



- అమరచింత పీహెచ్సీ ఏర్పాటు ఎప్పుడో?
- ఏడాది గడిచినా ఇంకా నెరవేరలే..
- ఇబ్బందుల్లో 13 గ్రామాల ప్రజలు

**వేద న్యూస్, అమరచింత:**

అమరచింత మండల కేంద్రంలో కొత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) మంజూరు చేస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో మంత్రి వాకిట శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఏడాది క్రితం హామీ ఇచ్చారు. జనవరి 2025లో అమరచింత సందర్శించిన సందర్భంగా సబ్‌సెంటర్‌ను ఇతర ప్రాంతానికి మార్చి మండల కేంద్రంలో కొత్త పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అయితే ఆ హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మక్తల్ నియోజకవర్గ ప్రజల ఆరోగ్యంపై మంత్రికి శ్రద్ధ లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో మంత్రి విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు.

**ఇబ్బందుల్లో 13గ్రామాల ప్రజలు**

అమరచింత మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్య సదుపాయం లేకపోవడంతో మండలంలోని 13 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నచిన్న వైద్య అవసరాల కోసం కూడా ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. హామీ ఇచ్చి ఏడాది గడిచినా ఇప్పటికీ స్పందించకపోవడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. అమరచింత పట్టణ ప్రజలు మరియు పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మంత్రి వాకిట శ్రీహరి స్పందించి అమరచింత మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు

**వేద న్యూస్, చందుర్తి:**




చందుర్తి మండలంలోని మూడపల్లి గ్రామ రైతు వేదికలో ఏటీఎంఏ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చిలుక మల్లీశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా రసాయన ఎరువుల వినియోగం, ఆయిల్ పామ్ సాగు, ప్రకృతి వ్యవసాయం, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, డైరెక్టర్ బాణాల లావణ్య, మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, జిల్లెల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ మధుకర్, స్థానిక ఏఈఓ ప్రవీణ్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఫ్యాన్లు, మంచినీటి సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్షేమంగా పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లి తిరిగి ఇంటికి తీసుకురావాలని అన్నారు. ప్రతి విద్యార్థి పరీక్షల్లో ఉత్తీర్ణులై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని, శాతం వంద ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులందరికీ బండి సంజయ్ శుభాకాంక్షలు తెలిపారు.

# పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

- మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్

**వేద న్యూస్, బోయినిపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. నేటి నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగే పరీక్షల కోసం మండలంలోని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఫ్యాన్లు, లైట్లు, త్రాగునీరు వంటి సౌకర్యాలతో పాటు ఆరోగ్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలోని బోయినిపల్లి మరియు విలాసాగర్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. బోయినిపల్లి కేంద్రంలో ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, కోరేం, స్తంభంపల్లి, బోయినిపల్లి మరియు ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విలాసాగర్ కేంద్రంలో విలాసాగర్, వెంకట్రావుపల్లి, నర్సింగపూర్, కొదురుపాక పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారు. బోయినిపల్లి కేంద్రంలో 155 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 10 మంది ఇన్విజిలేటర్లు, విలాసాగర్ కేంద్రంలో 88 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 7 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించనున్నట్లు విద్యాధికారి తెలిపారు.

# పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- నవజాత శిశువుల తల్లులకు హెల్త్ కిట్లు, హెల్త్ కార్డుల పంపిణీ

**వేద న్యూస్, మహబూబ్ నగర్:**



మహబూబ్ నగర్ నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రసవం చేసిన నవజాత శిశువుల తల్లులకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి హెల్త్ కిట్లు, హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. మహబూబ్ నగర్‌ను తెలంగాణ రాష్ట్రంలోనే ఆరోగ్య మహబూబ్ నగర్ గా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రసవం అనంతరం తల్లులు మరియు శిశువుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తన స్వంత నిధులతో యెన్నం హెల్త్ కిట్లు మరియు యెన్నం హెల్త్ కార్డులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగ అజ్మీర, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుడు బెజ్జగం రాఘవేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోస్గి శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం

**వేద న్యూస్, జయశంకర్ భూపాలపల్లి:**



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ సరిత రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని కాలనీలలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని, అలాగే మల్లన్న దేవుని ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులు విడుదల చేసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. ఈ విషయాన్ని సర్పంచ్ సరిత తెలిపారు.

# 75వ రోజుకు చేరుకున్న రిజర్వాయర్ వ్యతిరేక రైతుల ధర్నా

- రైతుల నిరసనకు టీఆర్‌పీ మద్దతు
- దండే విజయుడు, జిల్లా బృందం సంఘీభావం



**వేద న్యూస్, ఏదుల మండలం:**

ఏదుల మండల కేంద్రంలో గొల్లపల్లి–చీర్కపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన నిరసన దీక్ష 75వ రోజుకు చేరుకుంది. ఈ నిరసన కార్యక్రమాన్ని గొల్లపల్లిచీర్కపల్లి రిజర్వాయర్ వ్యతిరేక అఖిలపక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు దండే విజయుడు జిల్లా బృందంతో కలిసి దీక్షా శిబిరాన్ని సందర్శించి రైతులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు తాము ఇక్కడికి వచ్చామని ఆయన తెలిపారు. రైతులకు అవసరం లేని ప్రాజెక్టులను నిర్మిస్తూ చిన్న, సన్నకారు రైతుల భూములను తీసుకోవడం సరైంది కాదని ఆయన విమర్శించారు. ఇప్పటికే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఏదుల మండలంలో రిజర్వాయర్ ఉన్నప్పటికీ, మరోసారి గొల్లపల్లిచీర్కపల్లి రిజర్వాయర్ ఎందుకు నిర్మిస్తున్నారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రశ్నించారు. రైతుల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కాలువలను పూర్తి చేసి రైతులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతుల భూములకు నష్టం కలిగిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. త్వరలో టీఆర్‌పీ పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న కూడా నిరసన శిబిరాన్ని సందర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు దొడ్ల రాములు, రమేష్ యాదవ్, సునీల్ కుమార్, నాయకులు అబ్దుల్ మహమూద్, జి. రాములు, జిమ్మి శేషయ్య, నితీష్, జెట్టి కృష్ణయ్య, స్వామి, వెంకట్, శ్రీనివాస్, డేవిడ్, గోవింద్ నాయుడు, కళ్యాణ్, కిష్టరాజు, దర్గయ్య, దస్తాయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాజులగూడెంలో ఘనంగా స్వయంపాలన దినోత్సవం

**వేద న్యూస్,పాపన్నపేట:**



పాపన్నపేట మండలం గాజుల గూడెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. డీఈవోగా మనోజ్ కుమార్,ఎంఈవో గా ప్రణవి, ప్రధానోపాధ్యాయురాలు గా చందన, పీఈటీలుగా చరణ్,శ్రీకర్,ఉపాధ్యాయులుగా అర్మాన్ ఆహిల్, శ్రావణి, నవ్యత, అశ్విత అల్ఫియా, దృతిక, అనోన్య, ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిసిరి, రవీందర్, వేణుగోపాల్ వర్మ సాయిలుచారి పర్యవేక్షించారు.

# గ్యాస్ సరఫరా విషయంలో అపోహలు వద్దు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వేద న్యూస్, పాపన్నపేట :**



అమెరికా–ఇరాన్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత ఉందన్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు కావలసినంత గ్యాస్ సరఫరా అందించబడుతుందని, అపోహలకు గురికాకుండా అవసరమైన మేరకే సిలిండర్లు బుక్ చేసుకోవాలని సూచించారు. బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉందని ఎక్కడా నమోదు కాలేదని, బ్లాక్ మార్కెటింగ్ లేదా అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. రాష్ట్రంలో 810 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా రోజుకు 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా సమన్వయ కమిటీలతో రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించే విధంగా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు మళ్లీ విజ్ఞప్తి చేస్తూ, నగర ప్రాంతాల్లో 25 రోజులకొకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల్లో ఒకసారి ఎల్‌పీజీ సిలిండర్లు బుక్ చేసుకోవాలని, అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయొద్దని మంత్రి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత లేదు. ప్రజల అవసరానికి సరిపడా సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, ఎలాంటి అసత్య వార్తలకు ప్రజలు అలజడి చెందకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీ రమాదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**వేద న్యూస్, పాపన్నపేట :**

మండల కేంద్రమైన పాపన్నపేటలోని శ్రీవిద్య పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం శుక్రవారం నాడు నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కలెక్టర్ గా శివాని, డీఈవో సునయన,ఎంఈఓ హర్షిత్ రెడ్డి,ప్రధానోపాధ్యాయులుగా శ్రీనాథ్, ఉపాధ్యాయులు గా యశస్వ, నిహారిక, రేహమాన్,వర్షిని ,పాటిల్, ఆదర్శ్,సుమయ,కీర్తన, దీక్షిత, భవ్య శ్రీ, దీక్షిత ,సోఫియాన్,మనోజ్,దీపక్ గౌడ్,వేణు సాగర్ తో పాటు 57 మంది ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. దీనితో పాఠశాల ప్రాంగణమంతా పండగ వాతావరణం నెలకొంది. బోధనలో ప్రతిభా కనబరిచిన వారికి ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం మార్చి 14, 2026

# కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వీర్నపల్లి మండల కేంద్రంలో కుమ్మరి (శాలివాహన) సంఘం మరియు యువత ఆధ్వర్యంలో తెలుగు తొలి మహిళా కవయిత్రి మొల్ల మాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం సభ్యులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దసరాం చిన్న నారాయణ మాట్లాడుతూ.. వాల్మీకి రచించిన రామాయణాన్ని సంస్కృతం నుండి సరళమైన తెలుగు భాషలో అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించిన తొలి మహిళా కవయిత్రి మొల్ల అని తెలిపారు. 15వ శతాబ్దంలో జీవించిన మొల్ల, కుమ్మర కేశన్నకు జన్మించిన మహనీయురాలని పేర్కొన్నారు. 24 వేల శ్లోకాలతో ఉన్న రామాయణాన్ని 871 శ్లోకాలతో 8 ఖండాలుగా సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా రచించిన గొప్ప కవయిత్రి మొల్ల అని కొనియాడారు. యూత్ సభ్యుడు అన్నారం అజయ్ కుమార్ మాట్లాడుతూ మొల్ల తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు అపారమని తెలిపారు. మొల్ల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. మొల్ల వంటి గొప్ప కవయిత్రి కుమ్మరి ఆడపడుచు కావడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, లక్ష్మీనారాయణ, రాజేశం, ఎల్లం లచ్చయ్య, అజయ్ కుమార్, తిరుపతి, అరవింద్ తదితరులు మరియు యువ సభ్యులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**వేద న్యూస్, కోటగిరి :**



కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద పాఠశాలలో లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ఆధ్వర్యంలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. లైన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ కోశాధికారి ఉమాకాంత్ దేశ్ముఖ్ వీటిని విద్యార్థులకు అందించారు. పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను భయాన్ని వీడి రాయాలని, మండల స్థాయిలో ప్రతిభను కనపర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కోటగిరి డైమండ్ అధ్యక్షుడు తెల్ల రవికుమార్, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు పటేల్, పాఠశాల కరస్పాండెంట్ తెల్ల అక్షర, ఉపాధ్యాయ బృందం సాయి పవన్, నఫీస్, సురేఖ, నాగరాజు, భీమ్రావు, గంగాధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారిణి మల్లమ్మకు బీఆర్ఎస్ నాయకుల నివాళి

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారిణి లెంకల మల్లమ్మ (85) గురువారం మరణించారు. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్), మంత్రి కేటీఆర్లకు ఆమె వీరాభిమాని. ఈ సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు మల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె చిత్రపటానికి పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు తోట ఆగన్న మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో మల్లమ్మ చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆమె పార్టీకి, ఉద్యమానికి అందించిన సేవలు ఎప్పటికీ మరచిపోలేనివని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, భగవంతం గ్రామ శాఖ అధ్యక్షుడు కముటం నాగరాజు, మండల యువ ప్రధాన కార్యదర్శి అన్నారం అజయ్ కుమార్, బోడ పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లను ప్రేరేపించిన వారిపై కఠిన చర్యలు తప్పవు

**వేద న్యూస్, చందుర్తి:**



సోషల్ మీడియా ద్వారా మైనర్లను తప్పుదోవ పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పల్లపు నవీన్ అనే వ్యక్తి తన వద్ద పని నేర్చుకుంటున్న ఒక మైనర్ బాలుడికి మొబైల్ ఫోన్, ఇంటర్నెట్ డేటా ఇచ్చి ఇన్స్టాగ్రామ్ ద్వారా మైనర్ బాలికతో చాట్ చేయించేలా ప్రేరేపించాడు. బాలికను ప్రేమించమని బాలుడిని ప్రోత్సహించి, ఆమె ప్రేమను నిరాకరిస్తే ఇన్స్టాగ్రామ్ చాట్ బయటపెడతామని చెప్పేలా ప్రేరేపించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై టెక్నాలజీ సహాయంతో నిందితుడిని గుర్తించి, అతని నేర ఒప్పందాన్ని నమోదు చేసి మొబైల్ ఫోన్ను స్వాధీనం చేసుకుని రిమాండ్ కోసం కోర్టుకు తరలించినట్లు సీఐ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మైనర్లను ప్రేరేపించే లేదా తప్పుదోవ పట్టించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 35వ డివిజన్లో అనారోగ్యంతో మృతి చెందిన గౌసియా కుటుంబాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకుడు శ్రీరామ్ రాజేష్ పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. కొండా దంపతుల ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని కలుసుకున్న ఆయన రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రాజేష్ మాట్లాడుతూ తనకు తోచిన విధంగా సహాయం చేశానని, భవిష్యత్తులో కూడా కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కాంగ్రెస్ నాయకులు పగడాల సతీష్, అక్షిత్ పటేల్, బండి నరేందర్, ప్రియదర్శిని, ముంతాజ్, శ్రీలత, లత, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ పరిసరాల్లో చెత్త తొలగింపు



**వేద న్యూస్, కాజీపేట:**

హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేటలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన 90 రోజుల కార్యక్రమంలో భాగంగా వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి వాటర్ ట్యాంక్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విజయశ్రీ సయ్యద్ రజాలి మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా డివిజన్లోని అన్ని కాలనీలలో వివిధ శాఖలకు సంబంధించిన పనులు చేపడుతున్నామని తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ కర్ణాకర్, జవాన్లు సురేందర్, రాజవర్ధన్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్ గ్రామంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ ఓదెల రామకృష్ణ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలో ప్రతి ఇంటిలో నిర్వహిస్తున్న డ్రైడేఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం తిమ్మాపూర్ తండాలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు, మహిళా సంఘం భవన నిర్మాణం, నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మహేశ్వర రెడ్డి, సర్పంచ్ మేఘవత్ లత, పంచాయతీ కార్యదర్శులు రమేష్, నిరోష, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**వేద న్యూస్, పోతంగల్ :**



ప్రజాపాలన ప్రగతిలో బాగంగా మండలంలోని సుంకిని గ్రామంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో చందర్ మాట్లాడుతూ..గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఫ్రైడే సందర్భంగా దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ షాజీ పటేల్, గ్రామ కార్యదర్శి రాము, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఉపాధిహామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ

**వేద న్యూస్, చొప్పదండి:**



ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా చొప్పదండి మండల ఎంపీడీఓ ఆర్. వేణుగోపాల్ రావు మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ముందుగా గ్రామంలోని నర్సరీను సందర్శించి మొక్కల షిఫ్టింగ్, గ్రేడింగ్ పనులపై కూలీలకు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ వర్క్సైట్ను పరిశీలించి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఉపాధి హామీ పథకం అక్షయపాత్ర వంటిదని, ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజు, వార్డు సభ్యురాలు కోలపురి మమత, కార్యదర్శి త్రిదండపాణి శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ జగదీష్, గజ్జెల అశోక్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**వేద న్యూస్, పోతంగల్ :**

పోతంగల్ మండల కేంద్రంలో శనివారం ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంఈఓ శంకర్ తెలిపారు. మండల కేంద్రంలోనీ జిల్లా పరిషత్ పాఠశాలలో 181మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.10 మంది ఇన్విజిలేటర్లు పరీక్ష నిర్వహణ విధుల్లో పాల్గొననున్నట్లు వివరించారు.

# ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరాన్ని పరిశీలన

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని అధికారులు సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ శిబిరంలో స్త్రీల వైద్య నిపుణులు, పిల్లల వైద్యులు, ఎముకల, నేత్ర, దంత వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్లు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులు వెంటనే అందజేయాలని అధికారులు వైద్య సిబ్బందికి సూచించారు. వేసవి కాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవసరం లేకుండా బయటకు రావద్దని, నీరు, మజ్జిగ, కొబ్బరి బొండం, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ సారియా అంజు, ప్రత్యేక వైద్య నిపుణులు డాక్టర్ వంశీ గౌడ్, డాక్టర్ నవీన మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గుడిసెలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట

– టాస్క్ ఫోర్స్ దాడి.. నలుగురు అరెస్ట్

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని ఓ గుడిసెలో కొంతమంది వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్ ఫోర్స్ బృందం స్థానిక పోలీసులతో కలిసి అక్కడికి చేరుకుని ఆకస్మికంగా దాడి చేసింది. దాడి సమయంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్ఫోన్లు, రెండు బైక్లు, ప్లేయింగ్ కార్డులు, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేద న్యూస్

శనివారం మార్చి 14, 2026

# ప్రగతి పథంలో పేదల సంక్షేమం

**- అభివృద్ధి పనులకు సమాంతర ప్రాధాన్యం - రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఈ రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలోనే కేవలం బీరోలు గ్రామానికి రూ. 29.92 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఇందులో భాగంగా రూ. 2.59 కోట్లతో బీరోలు నుంచి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి భూమి పూజ చేశారు. అలాగే బంధంపల్లిలో రూ. 5.50 కోట్లతో దమ్మాయిగూడెం నుంచి సోలిపురం రోడ్డు మధ్య నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల పనులు, కల్వర్టుల నిర్మాణం, చెరువు మరమ్మత్తులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేశామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలు సామాన్యుడి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 72 వేల ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో పేదల చెంతకు చేరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఆకేరు వాగు ముంపునకు గురైన రాకాసితండా బాధితులను మంత్రి పరామర్శించి, వారికి ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా ప్యాకెట్లను పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి, ఆలయ ధర్మకర్తలను శాలువాలతో సత్కరించారు.

# జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- ఎమ్మెల్యేకు వినతిపత్రం**

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**



గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తమ డిమాండ్లను వినిపించారు. కార్మికులకు నెలకు రూ.26వేల వేతనం ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని, రెండో పీఆర్సీని గ్రామపంచాయతీ కార్మికులకు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముశం రమేష్, యూనియన్ జిల్లా అధ్యక్షులు బూర శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి మల్యాల నరసయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా నాయకులు ఎలిగేటి రాజశేఖర్, మండల నాయకులు గూడెం శ్రీనివాస్, రవి, మల్లయ్య, బిక్షపతి, గంభీరావుపేట మండల అధ్యక్షుడు అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సర్పంచ్ హామీ

**వేద న్యూస్, కారేపల్లి:**



ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రణాళిక శిక్షణ ముగిసిన నేపథ్యంలో, కారేపల్లి మండలంలోని భజ్యతండా గ్రామ పంచాయతీలో సరికొత్త అధ్యాయం మొదలైంది. అత్యంత పారదర్శకంగా, ప్రజా భాగస్వామ్యంతో నిర్వహించిన తొలి గ్రామసభ స్థానిక ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. గ్రామాభివృద్ధిలో ప్రతి పౌరుడిని భాగస్వామిని చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం సాగింది. ఈ సభకు గ్రామ సర్పంచ్ హనుమంతరావు అధ్యక్షత వహించగా, పంచాయతీ కార్యదర్శి రమేష్ పర్యవేక్షణలో చర్చలు జరిగాయి. గ్రామంలోని మౌలిక వసతులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పనులపై సర్పంచ్ సుదీర్ఘంగా వివరించారు. "గ్రామస్తులందరూ ఐక్యంగా ఉంటేనే భజ్యతండాను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దగలమని" ఆయన పిలుపునిచ్చారు. గ్రామసభలో ప్రధానంగా విద్య, ఆరోగ్యం, పరిశుభ్రతపై లోతైన చర్చ జరిగింది. ప్రభుత్వ పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు చేరుతుండటంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లోపాల వల్ల సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఈ సమస్య తలెత్తిందని, దీనిని త్వరలోనే యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. ఆశా వర్కర్ల సహకారంతో గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణకు పటిష్టమైన ప్రణాళికలు రూపొందించారు. మండలంలోనే నంబర్ వన్ లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలు సమన్వయంతో పనిచేయడంపై పంచాయతీ కార్యదర్శి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. అందరి సహకారంతో భజ్యతండాను మండలంలోనే ఆదర్శ గ్రామంగా మారుస్తామని సభలో తీర్మానించారు.

# మృతురాలి కుటుంబానికి అండగా ఎమ్మెల్యే

**వేద న్యూస్, కారేపల్లి :**



సింగరేణి మండలం, ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన భూక్యా బుచ్చమ్మ ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఆ కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో, వారికి అండగా నిలిచేందుకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముందుకు వచ్చారు. సమయస్ఫూర్తితో సాయం బుచ్చమ్మ మృతితో కుటుంబం పడుతున్న ఇబ్బందులను గమనించిన బోడ సేట్ రామ్ నాయక్, వెంటనే ఈ విషయాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, వెంటనే ఆ కుటుంబానికి ఒక క్వింటా బియ్యాన్ని అందజేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమంలో రెడ్డిబోయిన జగ్గయ్య యాదవ్, గుంపిడి నాగేశ్వరరావు, బ్రహ్మోవత్ శంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి, ప్రజా ప్రతినిధులు చూపుతున్న చొరవను గ్రామస్థులు అభినందిస్తున్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అందించే ఇటువంటి చేయూత పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుంది.

# ఖాళీ సిలిండర్, కట్టెల పొయ్యితో సీపీఐ నిరసన

**వేద న్యూస్, వనపర్తి:**




దేశంలో వంటగ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. ఖాళీ సిలిండర్‌కు దండ వేసి, కట్టెల పొయ్యిపై వంట చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పట్టణ కన్వీనర్ జయమ్మ మాట్లాడుతూ.. గ్యాస్ ధరలను పెంచడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. అమెరికాఇజ్రాయిల్ఇరాన్ యుద్ధం పేరుతో వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ.60, వాణిజ్య సిలిండర్ ధరను రూ.115 పెంచడం సామాన్యులపై భారం మోపినట్లేనన్నారు. గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ "పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలి" అంటూ నినాదాలు చేశారు. ధరల పెరుగుదలపై ప్రదర్శించిన పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కాకం బాలస్వామి, చిన్న కురుమన్న, ఎర్రకురుమన్న, పృథ్వి నాదం, రమణ, వంశీ, వెంకటమ్మ, జ్యోతి, సుప్రియ, ఖాసీం బీ, ఖాజా, అలివేల, మైనూస్ తదితరులు పాల్గొన్నారు

# గర్జనపల్లి సబ్‌సెంటర్‌లో మందుల కొరత

**- రోగులకు ఇబ్బందులు**

**వేద న్యూస్, వీర్నపల్లి:**




రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ సబ్ సెంటర్లలోనే మందుల కొరత ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలోని ఆరోగ్య సబ్‌సెంటర్‌లో అవసరమైన మందులు లేక వృద్ధులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులు ప్రతిరోజూ చికిత్స కోసం సబ్‌సెంటర్‌కు వస్తున్నప్పటికీ ఇవ్వడానికి సరిపడా మాత్రలు లేవని ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారని గ్రామస్తులు అంటున్నారు. దీంతో మందులు అందక వృద్ధులు నిరాశతో తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గ్రామస్థాయిలోనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సబ్‌సెంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ మందులు అందుబాటులో లేకపోవడం వల్ల లక్ష్యం నెరవేరడం లేదని వారు తెలిపారు. కాబట్టి గర్జనపల్లి ఆరోగ్య సబ్‌సెంటర్‌కు తక్షణమే అవసరమైన మందులు సరఫరా చేయాలని గ్రామ ప్రజలు, వృద్ధులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# మహిళల వాలీబాల్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా అఖిల

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారిణి ముద్రకోలా అఖిల తెలంగాణ మహిళల వాలీబాల్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఎంపికయ్యారు. నేటి నుంచి 20 వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొనే తెలంగాణ మహిళల జట్టుకు ఆమె అసిస్టెంట్ కోచ్‌గా సేవలందించనున్నారు. ఫిబ్రవరి 16 నుండి 20 వరకు వేములవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మార్చి 2 నుండి 12 వరకు ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆ శిక్షణ శిబిరంలో అఖిల ప్రతిభను గుర్తించి తెలంగాణ మహిళల జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా ఎంపిక చేశారు. జాతీయ స్థాయి పోటీల కోసం అఖిల మార్చి 13న భువనేశ్వర్‌కు ప్రయాణమయ్యారు. ఆమె ఎంపికపై మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# చొప్పదండి వ్యవసాయ మార్కెట్లో మేకలు

**- భద్రత లేని వ్యవసాయ మార్కెట్.. రైతుల ఆవేదన**
**- పట్టించుకోని అధికారులు..**

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గత కొద్ది రోజులుగా గుర్తుతెలియని వ్యక్తుల మేకలు యథేచ్ఛగా తిరుగుతూ రైతుల ధాన్యాన్ని తింటుండడంతో రైతులు, వ్యాపారులు నష్టపోతున్నారు. మార్కెట్ యార్డ్‌కు వచ్చే మేకల వల్ల ధాన్యం నష్టపోతున్నప్పటికీ పలుమార్లు మేకల యజమానులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వ్యాపారులు తెలిపారు. మార్కెట్‌లో సరైన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్లే మేకలు యార్డ్‌లోకి ప్రవేశిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్ అధికారులు, చైర్మన్, బాడీ సభ్యులకు ఈ విషయం కనిపించదా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ యార్డ్‌లో భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

# ప్రమాదవశాత్తు వృద్ధురాలు మృతి

**వేద న్యూస్, మందమర్రి :**



ప్రమాదవశాత్తు కింద పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మందమర్రి పట్టణంలో చోటు చేసుకుంది. మందమర్రి పట్టణ ఎస్ఐ జి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని రెండవ జోన్ ప్రాంతంలో నివాసముంటున్న జక్కన బోయిన లక్ష్మి (80) అనే వృద్ధిరాలు తన సొంత ఇంట్లో ఒంటరిగా నివాసం ఉంటుండగా మార్చి12 వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో, అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న ఎండి రసూల్ అనే వ్యక్తి మృతురాలి కుమారునికి ఫోన్ చేసి మీ తల్లి గడప వద్ద కింద పడి చనిపోయిందని సమాచారం తెలిపారని పేర్కొన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడి చేరుకొని పరిశీలించగా ఇంటి గడప తగిన క్రిందపడి తలకు గాయమై మృతి చెందినట్లు గుర్తించారని అలాగే మృతురాలి కుడి చేతి పై ఏదో జంతువు కరిచి గాయమైనట్లు మృతురాలి కుమారుడు తన ఫిర్యాదులో పేర్కొన్నా డని తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారన్నారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మార్చి12 వ తేదీ రాత్రి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించి ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతున్నామని పేర్కొన్నారు.

# పదవ తరగతి పరీక్షల వద్ద 163 సెక్షన్ అమలు

**- ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్**

**వేద న్యూస్, పాపన్నపేట :**




పాపన్నపేట మండల పరిధిలోని నేటి నుండి పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నందున పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని శుక్రవారం పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 6పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 100మీటర్ల లోపు ఉన్న జీరాక్స్ సెంటర్లను మూసి వేయాలని షాపుల వారికి నోటీసులు అందజేశామన్నారు. పరీక్షలు జరిగే ప్రాంతంలో వ్యక్తులు గుంపులు,గుంపులు గుంపులుగా తిరగరాదని హెచ్చరించారు. విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయాలని, ఎలాంటి ఒత్తిడులు పెట్టుకోకూడదని ఎస్ఐ సూచించారు

# మొల్లమాంబ అందరికీ స్ఫూర్తిదాయకం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి
- మొల్లమాంబ జయంతి ఘనంగా నిర్వహణ
- విగ్రహ స్థలంకేటాయింపు పై ఎమ్మెల్యేకు వినతి



**వేద న్యూస్, వనపర్తి:**

వనపర్తి జిల్లా కేంద్రంలోని కుమ్మరి శాలివాహన సంఘం కమిటీ హాల్‌లో తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ జయంతిని పట్టణ అధ్యక్షులు బొడ్డుపల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి హాజరై మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృత రామాయణాన్ని సరళమైన తెలుగులో అద్భుతంగా రచించిన తొలి మహిళా కవయిత్రి మొల్లమాంబ అని కొనియాడారు. ఆమె జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మొల్ల ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలో మొల్లమాంబ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కుమ్మరి శాలివాహన సంఘం తరపున పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి వెంకటేష్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి సానుకూలంగా స్పందించి విగ్రహ స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లను సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు బి. తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాసులు, కోశాధికారి గుణగంటి స్వామితో పాటు సంఘం నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు ఎంపీ ఆల్ ది బెస్ట్

**వేద న్యూస్, నాగర్ కర్నూల్:**



రేపటి నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలను విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాసి ఉన్నత స్థాయికి ఎదగాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పదవ తరగతి విద్యార్థులకు ఆయన ఆల్ ది బెస్ట్ తెలిపారు. పరీక్షలను ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివిన విషయాలను నమ్మకంతో రాస్తే మంచి విజయాలు సాధించగలరని చెప్పారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు మానసికంగా ధైర్యం చెప్పాలని, పరీక్షల సమయంలో ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆశీర్వాదాలు అందజేశారు.

# భీమేష్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

## - రూ.50 వేల ఆర్థిక సాయం

**వేద న్యూస్, జడ్చర్ల:**



ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన జడ్చర్ల మున్సిపాలిటీ నాగసాల 5వ వార్డుకు చెందిన భీమేష్ (32) మృతదేహాన్ని కుక్కలు పీక్కు తిన్న ఘటన నేపథ్యంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భీమేష్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ ఘటన వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం మృతుడి కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు.

# డాక్టర్ వడ్యావత్ రమేష్ నాయక్‌కు ఘన సన్మానం

**వేద న్యూస్, జడ్చర్ల:**



జడ్చర్ల పట్టణానికి చెందిన గిరిజన విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు డాక్టర్ వడ్యావత్ రమేష్ నాయక్ ను బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం జడ్చర్ల పట్టణంలోని ఎంఆర్‌సి భవనం ఎదుట నిర్వహించారు. ఫిబ్రవరి 21న కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఐపిఎసి, న్యూఢిల్లీ సంస్థ ద్వారా వడ్యావత్ రమేష్ నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేయడం సందర్భంగా ఈ సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణ యాదవ్ మాట్లాడుతూ రమేష్ నాయక్ ఇరవై ఏళ్లుగా సామాజిక అంశాలపై ప్రశ్నించే గొంతుగా పనిచేస్తున్నారని అన్నారు. జడ్చర్లకు చెందిన ఆయన డాక్టరేట్ సాధించడం గర్వకారణమని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకుడు బుడ్డోళ్ల భీమ్‌రాజ్, బీసీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వేంకటేశ్, బీఎస్పీ నాయకుడు మహేష్, బీసీ జాగృతి సేన జిల్లా నాయకుడు నాగేష్, మండల అధ్యక్షుడు గొడుగు నర్సింహులు, టౌన్ ప్రధాన కార్యదర్శి వేంకటేశ్, ఆంజనేయులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీరు బాటిల్లో చెత్త,పాకురు..!?

**వేద న్యూస్, కరీమాబాద్:**



చల్లగా బీరు వేసి చిల్ అవుదాం అనుకున్న ఓ యువకుడికి షాక్ తగిలింది. శుక్రవారం మధ్యాహ్నం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్ ప్రాంతంలో ఓ వైన్ షాప్ లో ఓ యువకుడు బీర్ బాటిల్ కొనుగోలు చేశాడు. బయటికి వచ్చి బీరు తాగే లోపు ఆ బాటిల్లో ఏదో తేడాగా కనిపించింది.నిశితంగా పరిశీలించగా ఆ బీర్ బాటిల్ లో చెత్తతో పాటు పాకూరు కనిపించింది. ఇంకేముంది ఆ యువకుడు బీర్ బాటిల్ ని అందులో కనిపించే చెత్త, పాకురును వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇక సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్ గా మారింది.

# ఇప్ప పువ్వు సారాపై అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- జడ్చర్లలో నూతన మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభం




**వేద న్యూస్, జడ్చర్ల:**

ఇప్ప పువ్వు సారాపై సమగ్రంగా అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. జడ్చర్లలో నూతన మున్సిపల్ కార్యాలయ భవనం ప్రారంభ కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఇటీవల చేసిన ఇప్ప పువ్వు సారాపై వ్యాఖ్యల గురించి మీడియా ప్రశ్నించగా మంత్రి స్పందించారు. ఈ అంశంపై సమగ్ర అధ్యయనం చేసి అసెంబ్లీలో కూడా చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే అందజేసిన పరిశోధన పత్రాలను నిపుణుల ద్వారా విశ్లేషించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం దీనిపై మరింతగా మాట్లాడడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇదే సందర్భంగా జడ్చర్ల మున్సిపాలిటీలో రూ.4.33 కోట్లతో నిర్మించిన నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్మన్ సారిక రాంమోహన్, మార్కెట్ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏకాత్మ మానవతా వాదం ప్రపంచానికి దిక్సూచి

## - గంట రవికుమార్




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు అంత్యోదయ భారత్ కి ఎంతో అవసరమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పేర్కొన్నారు. పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026 కార్యక్రమం కరీమాబాద్ మండల అధ్యక్షులు బోరిగం నాగరాజు అధ్యక్షతన రోటరీ క్లబ్ హాల్లో నిర్వహించిన కార్యాశాలలో పాల్గొని 'సైద్ధాంతిక భూమిక లోని 'ఏకాత్మ మానవతా వాదం' కాలాంశాన్ని కార్యకర్తలు ఉద్దేశించి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కాలాంశంలో భాగంగా ఉద్దేశించి మాట్లాడుతూ.. మన భారతీయ సంస్కృతిలో అనేక విలువలున్నాయనే విషయాన్ని మరిచిపోయి, పాశ్చాత్య స్వార్థపూరిత, వ్యక్తివాద, పెట్టుబడిదారీ విలువలను ఈ రోజుల్లో ఆచరిస్తూ, సమాజంలో మానవతను మంటగల్పుతున్నారు. స్వాతంత్ర్య అనంతర కాలంలో ఈ విషయాన్ని పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారు గ్రహించి భారతీయ జనసంఘ్ రాజకీయ పార్టీని భారతీయ విలువల అమలు కోసం 'ఏకాత్మ మానవవాద సిద్ధాంతాన్ని' పార్టీ తాత్విక సిద్ధాంతంగా తీసుకుని పార్టీని పటిష్టపరిచారు. అదే బీజేపీగా అవతరించి, భారతీయ సాంస్కృతిక విలువలను మళ్లీ అమలు పరచడం ప్రారంభించింది. ఆ పార్టీ సాంస్కృతిక జాతీయవాదాన్ని పటిష్టంగా అమలుపరుస్తున్నది. ఇది పండిట్ దీన్ దయాళ్ గారి దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. ఆయన దేశంలోని ప్రతి వ్యక్తికి ఉపాధి ఉండి, ఉత్పత్తికి దోహదపడాలని, ప్రభుత్వాలు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరుకున్నారు. ఆయన తాత్విక సిద్ధాంతాల ఆధారంగానే బీజేపీ అనేక పథకాలు రూపకల్పన చేసి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించింది. ఆయన తాత్విక సిద్ధాంతాల పునాదుల మీద ఈరోజు భారత్ స్వశక్తి, స్వాభిమానం, ఆత్మనిర్బర్ భారత్ గా ఉండి ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. విశ్వ మానవ స్ఫూర్తితో "ఏకాత్మ మానవతావాదం" సిద్ధాంతాలను అనుసరిస్తున్నారు. ఈ రోజు దేశంలో అసమానతలు తగ్గుతున్నాయి. పేదరికం తగ్గుతోంది. ప్రజలందరూ అభివృద్ధి చెందుతున్నారు.. వారికి ఆధ్యాత్మికంగా స్పష్టమైన అభిప్రాయాలు ఉండాలి. అప్పుడే క్రమబద్ధమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, విలువలతో కూడిన



జీవనం అందుబాటులోకి వస్తుంది. ప్రజలందరూ విలువలతో కూడిన అభివృద్ధిని చూస్తే దేశం ఎంతో ముందడుగు వేస్తుందని అన్నారు. రాజకీయాలను ప్రజా సేవగా భావించి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆయన ఆలోచనలను "మేక్ ఇన్ ఇండియా", "వోకల్ ఫర్ లోకల్" వంటి కార్యక్రమాలలో ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ దాన్ని అనుసరిస్తూ దేశ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నారు' అని పేర్కొన్నారు. ఈ కార్యశాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు, ప్రశిక్షణ జిల్లా కోకన్వీనర్ కందిమల్ల మహేష్, బైరి నాగరాజు, ప్రశిక్షణ మండల కన్వీనర్ వంచనగిరి రాజ్ కుమార్, బిజెపి జిల్లా నాయకులు మాచర్ల దీన్ దయాళ్, మదాసు రాజు, టేకుమట్ల రేణుక, మరియు మండల పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు గ్రామాలలో పర్యటించాలి

## - కలెక్టర్ చంద్రశేఖర్

**వేదన్యూస్,నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**




నూతన ప్రజా ప్రతినిధులు గ్రామాలలో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా, మిర్యాలగూడ లో నిర్వహించిన మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 99 రోజుల పాటు నిర్వహించవలసిన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం రూపొందించి పది ప్రధాన అంశాలను తీసుకొని వాటి పై అవగాహనతో పాటు,సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా, ఇప్పటివరకు ప్రభుత్వం సాధించిన అభివృద్ధి పై ప్రజలకు తెలియజేసేందుకు చేపట్టడం జరిగిందని వెల్లడించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులందరుకలిసికట్టుగా పనిచేసి మిర్యాలగూడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందు నిలపాలన్నారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతున్నదని, పేదలు, అట్టడుగు వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం గతం నుండి ఎన్నో. సంస్కరణలు తెచ్చిందని తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ సుధ మాట్లాడారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మున్సిపల్ కమిషనర్, జిల్లా అధికారులు, సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# మొలచింతలపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

**వేద న్యూస్ నాగర్‌కర్నూలు :**



ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కోసం నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో ఉన్న భూసంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని జిల్లా అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపడమే ప్రజాపాలనప్రగతి ప్రణాళిక లక్ష్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

వేద న్యూస్

శనివారం మార్చి 14, 2026

# కష్టాల్లోనూ పాజిటివ్‌గా ఉండాలని సందేశం



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను తన అందం, నటనతో ఆకట్టుకున్న ప్రముఖ నటి హన్సిక మోత్వాని వ్యక్తిగత జీవితం ఇటీవల సోషల్ మీడియాలో పెద్ద చర్చగా మారింది. వ్యాపారవేత్త సోహైల్ కతూరియాను ప్రేమించి వివాహం చేసుకున్న హన్సిక అతనికి విడాకులు ఇచ్చిందనే వార్తలు కొంతకాలంగా నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో హన్సిక చేసిన తాజా సోషల్ మీడియా పోస్ట్ అభిమానుల దృష్టిని ఆకర్షించింది. హన్సిక తన సోషల్ మీడియా ఖాతాలో "చర్ది కాలా ఆల్వేస్" అనే పంజాబీ కోటేషన్‌ను షేర్ చేసింది. ఈ పదానికి అర్థం ఎలాంటి కష్టాలు ఎదురైనా మనసులో ధైర్యం, పాజిటివ్ భావనను కొనసాగించాలి అన్నది. ఈ పోస్ట్ ద్వారా తన జీవితంలో ఎదురైన పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటున్నానని హన్సిక సూచించినట్లు నెటిజన్లు భావిస్తున్నారు. కొంతకాలంగా హన్సిక, సోహైల్ కతూరియా మధ్య విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. ఇటీవల ముంబైలోని బాంద్రా కోర్టు వీరి విడాకులను ఖరారు చేసిందని కొన్ని మీడియా కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు హన్సిక లేదా ఆమె కుటుంబ సభ్యులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. హన్సిక మోత్వాని, సోహైల్ కతూరియా వివాహం 2022 డిసెంబర్ 4న రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా జరిగింది. ఆ పెళ్లి వేడుక అట్టహాసంగా జరిగి అప్పట్లో సోషల్ మీడియాలో కూడా విస్తృతంగా చర్చకు దారితీసింది. పెళ్లి తర్వాత కొంతకాలం వరకు ఈ జంట సంతోషంగా జీవిస్తున్నట్లు కనిపించింది. అయితే కొన్ని నెలల తర్వాత వీరిద్దరి మధ్య విభేదాలు ప్రారంభమైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా హన్సిక తన భర్తకు దూరంగా ఉంటూ తల్లితో కలిసి నివసిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి భర్తతో కలిసి ఉన్న కొన్ని ఫోటోలను తొలగించడం కూడా ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. హన్సిక వివాహం సమయంలో కూడా కొన్ని వివాదాలు చర్చనీయాంశమయ్యాయి. సోహైల్ కతూరియాకు ఇది రెండో వివాహం కాగా, అతని మొదటి భార్య హన్సికకు సన్నిహిత స్నేహితురాలు అన్న వార్తలు అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ట్రోల్స్‌పై హన్సిక స్పందిస్తూ సోహైల్ గతం తనకు ముందే తెలుసని, వారి విడాకులకు తాను కారణం కాదని స్పష్టం చేసింది. ఇప్పటివరకు హన్సిక, సోహైల్ విడిపోవడానికి గల ఖచ్చితమైన కారణాలు బయటకు రాలేదు. వ్యక్తిగత విభేదాల కారణంగానే ఈ జంట విడాకులు తీసుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో హన్సిక చేసిన తాజా పోస్ట్ ఆమె జీవితంలో కొత్త అధ్యాయానికి సంకేతంగా ఉందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

# సముద్రఖని 'కార్మేని సెల్వం' టీజర్!

**వేద న్యూస్ డెస్క్:**




డబ్బు, కుటుంబం మరియు మనుషుల ఆశయాల చుట్టూ తిరిగే ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన 'కార్మేని సెల్వం' సినిమా టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సముద్రఖని ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ ద్విభాషా చిత్రం తెలుగు, తమిళ భాషల్లో రూపొందింది. ఈ సినిమాను పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మించగా, రామ్ చక్రి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఏప్రిల్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సినిమా విడుదల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్‌లో నేటి సమాజంలో డబ్బు కోసం మనుషులు పడే పోరాటం, ఆర్థిక ఒత్తిడులు మరియు జీవిత విలువలను ప్రభావితం చేసే పరిస్థితులను ఆసక్తికరంగా చూపించారు. టీజర్ ప్రారంభంలో సముద్రఖని చెప్పే శక్తివంతమైన వాయిస్ ఓవర్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటుంది. డబ్బు సంపాదించడానికి అనేక మార్గాలు ఉన్నాయని చెప్పే ఆ డైలాగ్‌తో టీజర్ మొదలవుతుంది. నేటి కాలంలో మధ్యతరగతి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను ఈ సినిమా కథలో ప్రధానంగా చూపించినట్లు టీజర్ ద్వారా అర్థమవుతోంది. ప్రత్యేకంగా క్రెడిట్ కార్డ్ సంస్కృతి, ఈఎం ఐల భారం, క్రిప్టో పెట్టుబడులు మరియు త్వరగా ధనవంతులు కావాలనే ఆశతో చేసే ప్రయత్నాలు మనుషుల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో టీజర్‌లో చూపించారు. సముద్రఖని కుటుంబంతో గడిపే హృద్యమైన సన్నివేశాలు ఒకవైపు కనిపిస్తే, విదేశాల్లో ఒంటరిగా కనిపించే దృశ్యాలు మరోవైపు కథపై ఆసక్తిని పెంచుతున్నాయి.టీజర్ చివర్లో సముద్రఖని చెప్పే డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. "రిచ్ కావాలంటే రిచ్ మనిషిలా ఖర్చు చేయడం నేర్చుకోవాలిడ డబ్బు లేకపోతే అప్పు తీసుకుని ఖర్చు చేయాలి" అనే డైలాగ్ నేటి వినియోగదారి జీవనశైలికి అద్దం పడుతున్నట్లు కనిపిస్తోంది. ఈ చిత్రంలో సముద్రఖనితో పాటు గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. యువరాజ్ దక్షన్ ఛాయాగ్రహణం అందించగా, సంగీతాన్ని మ్యూజిక్ క్లౌడ్ స్టూడియో అందించింది. ప్రముఖ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తోంది. సామాజిక సందేశంతో పాటు కమర్షియల్ అంశాలను కలిపి రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాల్సి ఉంది. ప్రస్తుతం విడుదలైన టీజర్ మాత్రం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.

# 'కాక్‌టెయిల్ 2' ఫస్ట్ లుక్ రిలీజ్ డేట్ ఫిక్స్..!

**వేద న్యూస్ డెస్క్:**



బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'కాక్‌టెయిల్' సినిమాకు చాలా ఏళ్ల తర్వాత సీక్వెల్‌గా 'కాక్‌టెయిల్ 2' రూపొందుతోంది. ఈ చిత్రంలో ప్రముఖ నటుడు షాహిద్ కపూర్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న, నటి కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మడాక్ ఫిలింస్ అధినేత దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ సినిమాకు హోమీ అదాజానియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన తాజా అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. 'కాక్‌టెయిల్ 2' సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను మార్చి 18న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. అదే రోజున ప్రదర్శించబోతున్న 'ధురందర్ ది రివెంజ్' సినిమా ప్రీమియర్ షోల సందర్భంగా ఈ ఫస్ట్ లుక్‌ను గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ సినిమా విడుదల తేదీని కూడా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. 'కాక్‌టెయిల్ 2' చిత్రం జూన్ 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. దీంతో బాలీవుడ్ సినీ ప్రేక్షకుల్లో ఈ సినిమాపై ఆసక్తి పెరిగింది. 2012లో విడుదలైన 'కాక్‌టెయిల్' చిత్రం అప్పట్లో భారీ విజయాన్ని సాధించింది. ఆ సినిమాలో దీపికా పదుకొణె, సైఫ్ అలీ ఖాన్, దయానా పెంటి ప్రధాన పాత్రల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆధునిక యువత జీవనశైలి, ప్రేమ, స్నేహం వంటి అంశాల నేపథ్యంలో రూపొందిన ఆ సినిమా యువతలో ప్రత్యేక క్రేజ్ సంపాదించింది. ఇప్పుడు అదే కథ ప్రపంచాన్ని కొనసాగిస్తూ కొత్త తరం నటీనటులతో 'కాక్‌టెయిల్ 2' రూపొందించబడుతోంది. ముఖ్యంగా షాహిద్ కపూర్, రష్మిక మందన్న జంటగా నటించనున్న నేపథ్యంలో ఈ సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఇటీవల రష్మిక మందన్న బాలీవుడ్‌లో కూడా వరుస ప్రాజెక్ట్‌లతో బిజీగా మారింది. ఇప్పుడు 'కాక్‌టెయిల్ 2' ద్వారా మరో భారీ ప్రాజెక్ట్‌లో భాగమవుతోంది. దీంతో ఈ చిత్రం విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రామ్ చరణ్ బర్త్‌డేకు డబుల్ ధమాకా..

**వేద న్యూస్ డెస్క్:**



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులకు ఈ ఏడాది మార్చి నెల ప్రత్యేకంగా మారబోతోంది. ముఖ్యంగా మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు వరుస సర్ప్రైజ్‌లు ఇవ్వాలని చిత్ర బృందాలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'రంగస్థలం' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న రామ్ చరణ్ సుకుమార్ కాంబినేషన్ మళ్లీ RC17' ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల 'పుష్ప' సిరీస్‌తో సంచలన విజయాన్ని సాధించిన దర్శకుడు సుకుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా RC17' సినిమాకు సంబంధించిన ప్రత్యేక అప్‌డేట్ ఇవ్వడానికి మేకర్స్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేసే అవకాశం ఉందని, అలాగే సినిమా షూటింగ్ ఎప్పుడు ప్రారంభం కానుందో కూడా ప్రకటించే అవకాశముందని సమాచారం.

# కావ్య మారన్‌పై నెటిజన్ల ఆగ్రహం.. ట్రెండింగ్‌లో 'బాయ్‌కాట్ సన్‌రైజర్స్'




**వేద న్యూస్ డెస్క్:**

ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్‌పై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విదేశీ లీగ్ అయినప్పటికీ పాకిస్థాన్‌కు చెందిన క్రికెటర్‌ను కొనుగోలు చేసినందుకు ఆమెపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో 'బాయ్‌కాట్ సన్‌రైజర్స్' అనే హ్యాష్‌ట్యాగ్ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారి తీసింది. ఇంగ్లాండ్‌లో నిర్వహించే ది హండ్రెడ్ లీగ్ వేలంలో పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు కొనుగోలు చేయడం ఈ వివాదానికి కారణమైంది. వేలంలో అబ్రార్ అహ్మద్‌ను ఒక లక్ష తొంభై వేల యూరోల ధరకు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.2.34 కోట్లకు ఈ ఫ్రాంచైజీ దక్కించుకుంది. ఈ నిర్ణయంపై కొంతమంది అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేస్తున్నారు. భారత ఫ్రాంచైజీలు పాకిస్థాన్ ఆటగాళ్లను తీసుకోవడం చాలా సంవత్సరాలుగా నిలిచిపోయింది. ఐపీఎల్ ప్రారంభ కాలంలో వసీం అక్రమ్, సొహైల్ తన్వీర్ వంటి ఽఆటగాళ్లను ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండటంతో సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు అబ్రార్ అహ్మద్‌ను తీసుకుంది. ఈ విషయంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాను సంప్రదించగా, ది హండ్రెడ్ లీగ్ భారత క్రికెట్ బోర్డు నిర్వహించే పోటీ కాదని ఆయన స్పష్టం చేశారు. అది విదేశీ లీగ్ కావడంతో ఫ్రాంచైజీలు తమకు నచ్చిన ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చని, ఈ విషయంలో బీసీసీఐకి ప్రత్యక్ష సంబంధం లేదని పేర్కొన్నారు. ఇటీవల సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ విదేశీ లీగ్‌లలో కూడా అడుగుపెట్టింది. ఇంగ్లాండ్‌లో జరిగే ది హండ్రెడ్ లీగ్‌లో 'సన్‌రైజర్స్ లీడ్స్' పేరుతో జట్టును కొనుగోలు చేసింది. తాజా వేలంలో అబ్రార్ అహ్మద్‌ను జట్టులోకి తీసుకోవడంతో ఈ అంశం చర్చకు దారి తీసింది. తనను ఎంపిక చేసినందుకు సన్‌రైజర్స్ లీడ్స్ జట్టుకు, అలాగే కావ్య మారన్‌కు అబ్రార్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది ది హండ్రెడ్ లీగ్‌లో జట్టు విజయానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ప్రపంచకప్ విజయం అందరిది: సూర్యకుమార్


**వేద న్యూస్ డెస్క్:**




భారత క్రికెట్ జట్టు ప్రపంచకప్ విజయాన్ని అభిమానులకే అంకితం చేస్తున్నట్టు జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత మైదానంలో కొందరు ఆటగాళ్లు తమ ప్రియురాళ్లతో సంబరాలు చేసుకోవడంపై చర్చ జరుగుతున్న వేళ, ఈ విజయంలో అభిమానుల పాత్ర ఎంతో గొప్పదని ఆయన పేర్కొన్నారు. భారత్‌లో క్రికెట్ కేవలం ఒక ఆట మాత్రమే కాకుండా ప్రజల భావోద్వేగమని, అందుకే ఈ విజయం దేశంలోని ప్రతి ఒక్కరిదని సూర్యకుమార్ స్పష్టం చేశారు. మార్చి 8న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ క్రీడా మైదానంలో జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించిన భారత జట్టు వరుసగా రెండోసారి పొట్టి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. సొంతగడ్డపై ఈ ట్రోఫీని గెలిచిన తొలి ఆతిథ్య జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. సారథిగా దేశానికి ప్రపంచకప్ అందించిన ఆటగాళ్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ కూడా స్థానం సంపాదించాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ట్రోఫీని నిలబెట్టుకున్న తొలి జట్టుగా భారత జట్టు గుర్తింపు పొందడంలో ఆయన కీలక పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సూర్యకుమార్ ఒక సందేశాన్ని పంచుకున్నారు. "ప్రియమైన భారత జట్టు అభిమానులారా.. ముందుగా మీ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ మద్దతు, ఆశీర్వాదం వల్లనే మేము ఈ స్థాయికి చేరుకున్నాం. ఈ ప్రపంచకప్ ట్రోఫీ మొత్తం దేశానిదే. మేము గెలిచినా ఇది మా ఒక్కరి విజయమే కాదు. బ్యాట్ పట్టుకుని ప్రపంచకప్ గెలవాలని కలలు కనే ప్రతి చిన్నారి కల ఇందులో భాగమైంది. స్టేడియానికి వచ్చి మమ్మల్ని ప్రోత్సహించిన అభిమానులు, ఇంటి వద్ద నుంచి మాకు మద్దతుగా నిలిచిన లక్షలాది మంది ఈ విజయానికి కారణం" అని ఆయన పేర్కొన్నారు. అభిమానుల ప్రార్థనలు, ప్రేమ తమకు అపారమైన ప్రేరణనిచ్చాయని, అదే బలంతో జట్టు ఈ ఘనత సాధించిందని సూర్యకుమార్ తెలిపారు. భారత్‌లో క్రికెట్ ప్రజల హృదయాలకు దగ్గరైన ఆట అని, అందుకే ప్రపంచకప్ విజయం ప్రతి భారతీయుడి ఆనందంగా మారిందని ఆయన అన్నారు.

# ఫుట్‌బాల్ ఆడుతూ మైదానంలోనే కుప్పకూలిన యువ ఆటగాడు

**వేద న్యూస్ డెస్క్:**




భారత ఫుట్‌బాల్‌లో విషాదం చోటుచేసుకుంది. పంజాబ్ రాష్ట్రంలోని లుధియానా జిల్లా మాజ్రి గ్రామంలో జరిగిన స్థానిక ఫుట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొంటున్న యువ ఆటగాడు మైదానంలోనే కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు. గుండెపోటుతో రవీందర్ సింగ్ అనే 25 ఏళ్ల ఆటగాడు అక్కడికక్కడే మరణించినట్లు సమాచారం. స్థానిక ఫుట్‌బాల్ పోటీలో ఆడుతున్న సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురైన రవీందర్ సింగ్ మైదానంలోనే పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్నవారు అతడిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే అతడు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో అక్కడ ఉన్న ఆటగాళ్లు, ప్రేక్షకులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రవీందర్ సింగ్ ప్రస్తుతం భారత ఫుట్‌బాల్ లీగ్‌కు చెందిన నాంధారి ఫుట్‌బాల్ క్లబ్‌లో సభ్యుడిగా ఉన్నాడు. అంతేకాకుండా ఘర్షంకర్‌లోని బబ్బర్ అకాలీ మెమోరియల్ ఖల్సా కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చిన్న వయసులోనే ఫుట్‌బాల్‌లో ప్రతిభ చూపుతూ మంచి భవిష్యత్తు ఉన్న ఆటగాడిగా గుర్తింపు పొందాడు. రవీందర్ సింగ్ మృతికి కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఫుట్‌బాల్ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. అతని అంత్యక్రియలకు కుటుంబ సభ్యులతో పాటు ఇండియన్ ఫుట్‌బాల్ లీగ్‌కు చెందిన పలు క్లబ్‌ల ఆటగాళ్లు హాజరయ్యారు. "మా ఫుట్‌బాల్ క్లబ్‌లో భాగమైన రవీందర్ సింగ్ మరణించడం ఎంతో బాధాకరం. మంచి భవిష్యత్తు ఉన్న యువ ఆటగాడు ఇంత చిన్న వయసులోనే మృతి చెందడం కలిచివేస్తోంది. అతని అకాల మరణం ఫుట్‌బాల్ కుటుంబానికి తీరని లోటు. రవీందర్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాం" అని నాంధారి ఫుట్‌బాల్ క్లబ్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073